## కొనసాగుతున్న వాల్ రైటింగ్స్



మెదక్ పట్టణంలో వాల్ రైటింగ్ చేస్తున్న మల్లికార్జుగౌడ్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 14: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ రైటింగ్స్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్నది. సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి ఇరువైపులా వాల్ రైటింగ్ వేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఫాజిల్, జుబేర్ అహ్మద్, కిరణ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని ఆందోళన



చేగుంట రహదారిపై ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

చేగుంట, ఏప్రిల్ 14: చేగుంటలోని గాంధీ చౌరస్తా వద్ద డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం లబ్ధిదారులు రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మద్ది లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో చేగుంట గాంధీ చౌరస్తాలో అరగంట ధర్నా ఆందోళన చేపట్టారు. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు. ధర్నాలో సత్యనారాయణ, భవనీ, జ్యోతి, రాములు, సుజాత, షాదుల్లా, లక్ష్మి, ధన లక్ష్మి, సుల్తాన, రాజు, వంద బాధితులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని తరలించండి



నర్సాపూర్, ఏప్రిల్ 14: చిల్డ్రన్స్ పార్కులో ఉన్న అంబేద్కర్, ఇతర ప్రముఖుల విగ్రహాలను చెరువు కట్టపైకి తరలించాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్ గుప్తా డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నర్సాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి శ్రీధర్‌గుప్తా పూలమాల వేసి నివాళులర్పించారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 14: మండలంలోని కుకునూర్ ప్రాథమిక పాఠశాలలో 1979లో 7వ తరగతి అయిపోగానే ఉన్నత పాఠశాలల్లో చదువు కోసం విడిపోయారు. సోమవారం మెదక్‌లోని ఓ మిత్రుడి ఇంటిని వేదిక చేసుకుని కలుసుకున్నారు. 46 ఏండ్ల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నర్సింలు, భాస్కర్, వెంకటేశం, నరేశ్, గంగాధర్, యాదయ్య, లక్ష్మీనరసింహరావు, పద్మ, యమున, రాణి ఉన్నారు.

## 'మధ్యాహ్న' కార్మికులకూ కనీస వేతనం అమలు చేయాలి: సీఐటీయూ




మాట్లాడుతున్న నర్సమ్మ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 14: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి, అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో వీరి జిల్లా మహాసభ నిర్వహించారు. నర్సమ్మ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 4 నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రూ.3 వేలతో జీవితాన్ని ఎలా కొనసాగిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రూప్లే, ఉపాధ్యక్షులుగా యాదగిరి, కార్యదర్శిగా పద్మ, కమిటీ సభ్యులుగా యాదమ్మ, బాలమణి, బుచ్చమ్మను ఎన్నుకున్నారు.

## అంగన్‌వాడీల్లో పిల్లలకు అందని గుడ్లు



మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్14: పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేస్తున్నది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు కానీ పదిహేను రోజులుగా పిల్లలు, బాలింతలు, గర్భిణులకు కోడిగుడ్లు అందడం లేదు. ధూళిమిట్ట మండలం బెక్కల్‌లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు కోడిగుడ్లు అందకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజులుగా కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కోడిగుడ్ల సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లకావత్ దేవేందర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకను వివరణ కోరగా కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయిన మాట వాస్తవమేనని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

# బడుగుల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి



నర్సాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: రాందాస్ చౌరస్తాలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ మున్సిపాలిటీ: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వెల్దుర్తి మండలంలోని మానేపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- అంబేద్కర్ మ్యూజియానికి కాంగ్రెస్ ప్రభుత్వం తాళాలు
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- అంబేద్కర్ మహోన్నత వ్యక్తి: కలెక్టర్ రాహుల్‌రాజ్

అంబేద్కర్ చూపిన బాటలో నడిచి, ఆయన ఆశయాలను కొనసాగించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశం గర్వించేలా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి అక్కడ మ్యూజియం ఏర్పాటు చేస్తే, దానికి కాంగ్రెస్ పాలకులు తాళం వేయడం దురదృష్టకరమని గుర్తుచేశారు. సోమవారం నర్సాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. వెల్దుర్తి మండలంలోని మానేపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. మానేపల్లి అభివృద్ధికి అన్ని రకాలుగా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సంజీవయ్య కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్



పెద్దశంకరంపేటలో నూతన అంబేద్కర్ విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

### కలెక్టర్ రాహుల్ రాజ్ నివాళి

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా, పోస్టాఫీస్ చౌరస్తాలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, ఆర్డీవో రమాదేవితో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పెద్దశంకరంపేటలోని తిర్మలాపురంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆవిష్కరించారు. అంబేద్కర్ ఆశయాల సాధన దిశగా నేటి యువత నడుం బిగించి ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు.



చిన్నశంకరంపేట: మిర్జాపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్



మెదక్ టీఎన్జీవో భవన్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



చిలిపిచెడ్: చండూర్‌లో ర్యాలీ తీస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు



జిల్లా కార్యాయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# హాస్టల్‌లో అన్నీ సమస్యలే

- రెండు నెలలుగా గుడ్లు, చికెన్ బంద్
- రోజు పచ్చిపులుసుతోనే భోజనం
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి
- సమీకృత బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి, ఏప్రిల్14: కౌడిపల్లిలోని సమీకృత బాలికల హాస్టల్ విద్యార్థులు ఇడ్లీ తిని అస్వస్థతకు గురికాగా, సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాస్టల్‌ను తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో ఎక్కడ చూసినా అపరిశుభ్రతతో కూడిన పరిసరాలు తప్పా ఎక్కడ కూడా శుభ్రత లేదని హాస్టల్ వార్డెన్ నర్సమ్మపై ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పిల్లలతో మాట్లాడుతూ 35 మంది విద్యార్థినులు ఆదివారం ఉదయం ఇడ్లీ తిని అస్వస్థతకు గురయ్యారు. సోమవారం 12 మంది విద్యార్థినులు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మరో 35మందికి దవాఖాన సిబ్బంది, డాక్టర్లు హాస్టల్‌కు వెళ్లి చికిత్సలు నిర్వహించారు. గదులలో ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో పాటు బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటికి డోర్లు కూడా లేవు. రోజు పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌కు ఫోన్‌లో హాస్టల్ విషయం వివరించారు. కలెక్టర్ స్పందించి రీఓపెన్ అయ్యే వరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. హాస్టల్‌లో నిత్యావసర సరుకులు లేకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వైద్యం శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం కోసం జిల్లా వైద్యాధికారి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలించారు. విద్యార్థులకు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా డాక్టర్లు చూసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గనేశ్వర్ ఉన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, దుర్గారెడ్డి, నవీన్, సందీప్, కిశోర్‌గౌడ్, ప్రతాప్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఇరుకు రోడ్డులో రెండు విగ్రహాలు

- ఉద్రిక్త పరిస్థితుల్లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ, శివాజీ విగ్రహానికి భూమి పూజ
- అధికారులు వారించినా ఫలితం శూన్యం



అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేసిన దళిత నాయకులు



శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన యువజన సంఘం నాయకులు

కొల్చారం, ఏప్రిల్ 14: అటు అంబేద్కర్ విగ్రహావిష్కరణ, ఇటు ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజతో సోమవారం కొల్చారంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొల్చారం బస్టాండ్ వద్ద గ్రామంలోకి వెళ్లే నడి రోడ్డులో గద్దె కింది హరిజన వాడకు చెందిన దళిత నాయకులు ఎలాంటి సమాచారం లేకుండా ఆదివారం అర్ధ రాత్రి గద్దెను నిర్మించి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు పెట్రోలింగ్ చేసే సమయంలో గద్దె నిర్మాణ పనులు అడ్డుకోక పోవడంతోనే రోడ్డు మధ్యలో విగ్రహం ఏర్పాటు చేశారని, తాము కూడా నడిరోడ్డులోనే శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అనుమతివ్వాలని పంచాయతీ కార్యదర్శికి యువజన సంఘం నాయకులు ఫోన్ చేశారు. దీంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దళిత నాయకులు విగ్రహావిష్కరణకు రాగా డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఎస్ఐ గౌస్, పంచాయతీ కార్యదర్శి అంజయ్య వారితో మాట్లాడారు. ఇది ఇరుకు రోడ్డని, ఇక్కడ రోడ్డుకు అడ్డంగా విగ్రహం ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు కారణమవుతుందని నచ్చజెప్పారు. ప్రత్యామ్నాయ స్థలాలు చూపించే ప్రయత్నం చేశారు. భవిష్యత్‌లో సమస్యలు వస్తాయని చెప్పిన దళితులు వినలేదు. దళితులు తాము ఏర్పాటు చేసిన చోటనే విగ్రహం ఉండాలని పట్టుబట్టడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఎస్ఐ మాట్లాడుతూ రేపు తహసీల్దార్ వస్తారని రేపటి వరకు విగ్రహావిష్కరణ ప్రయత్నం విరమించాలని కోరినా వారు వినిపించుకోలేదు. అధికారుల ముందే ఉద్రిక్త పరిస్థితుల నడుమ విగ్రహావిష్కరణ చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### శివాజీ విగ్రహానికి భూమి పూజ

దళితులు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన కొద్ది దూరంలోనే శివాజీ యువజన సంఘం సభ్యులు పలువురు గ్రామస్తులతో కలిసి బస్టాండ్ వద్ద శివాజీ విగ్రహ ఏర్పాటుకు అనుమతినివ్వాలంటూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడ కాషాయ జెండా ఆవిష్కరించి, భూమి పూజ చేశారు.

# తల్లీ కొడుకు ఆత్మహత్యాయత్నం



నర్సాపూర్ పీఎస్‌లో మహిళకు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై లింగం

నర్సాపూర్, ఏప్రిల్ 14: కుటుంబ కలహాలతో తన కొడుకుతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ఓ మహిళ యత్నించిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయారావు చెరువు వద్ద చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకా రం.. మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన మన్నె జయమ్మ(33) కొన్ని రో జులుగా తన భర్త అనిల్‌కుమార్‌తో కలిసి నర్సాపూర్‌లో జీవిస్తున్నది. సోమవారం కు టుంబ కలహాలతో కలత చెందిన జయమ్మ తన కుమారుడిని (నాలుగేండ్లు) తీసుకుని పట్టణ సమీపంలోని రాయారావు చెరువు వద్దకు వెళ్లింది. ఆత్మహత్య చేసుకుందామని చెరువులోకి దిగగా తన కుమారుడు ఏడువ డం ప్రారంభించాడు. తల్లి జయమ్మకు మన సు ఒప్పక తిరిగి గట్టుకు చేరుకున్నది. ఇది గమనించిన స్థానికులు వివరాలు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని జయమ్మను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పం పించారు. కుటుంబంలో చిన్నచిన్న గొడవలు సర్వసాధారణమని, దానికోసం ఆత్మహత్యకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై లింగం సూచించారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



చిన్నశంకరంపేట మండలంలో..



చేగుంట మండలంలో..

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 14: వివిధ గ్రామాల్లో సంబంధిత సొసైటీల చైర్మన్లు సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జంగరాయి, చందాపూర్, అంబాజిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. కామారం గిరిజన తండాలో చైర్మన్ అంజిరెడ్డి, గజగట్ల పల్లిలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

### చేగుంటలో..

చేగుంట, ఏప్రిల్ 14: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండ చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపూర్ సొసైటీ వైస్ చైర్మన్ పట్నం తానీషా, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు కుమ్మరి శ్రీనివాస్, బండి కవితా విశ్వేశ్వర్ పేర్కొన్నారు. ఇబ్రహీంపూర్ సొసైటీ పరిధిలోని మక్కరాజిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

## అంతరపంటలకు ప్రాధాన్యమివ్వాలి



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

రామాయంపేట, ఏప్రిల్ 14: వేసవిలో కూరగాయలు, మిర్చి సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం రామాయంపేట రైతువేదికలో హైదరాబాద్ నుంచి భూభారతి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో అంతర పంటల సాగుకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో ఏడీఏ రాజ్‌నారాయణ, ఏఈవోలు ప్రవీణ్, సాయికృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట ఎస్సైకి సన్మానం



నిజాంపేట, ఏప్రిల్ 14: నిజాంపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్‌ను వెంకటాపూర్(కె) గ్రామానికి చెందిన నాయకులు మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కలిశారు. అనంతరం ఎస్సై రాజేశ్‌కు శాలువ కప్పి సన్మానించారు.

## బాధిత కుటుంబానికి అండ



నిజాంపేట, ఏప్రిల్ 14: మండలంలోని జెడ్చెరువు తండాకు చెందిన తుకారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ సోమవారం బాధిత కుటుంబసభ్యులకు నిత్యావసర సరుకులతో పాటు 25 కిలోల బియ్యం అందజేసి, పరామర్శించారు.

## యువతి అదృశ్యం



మన్నె నాగలక్ష్మి

మనోహరాబాద్, ఏప్రిల్ 14: సూపర్ మార్కెట్‌లో పనికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుభాష్ గౌడ్ కథనం ప్రకారం.. కాళ్లకల్‌కు చెందిన చామంతుల మన్నె నాగలక్ష్మి (19) కొన్ని రోజుల క్రితం అత్వెల్లిలోని నేషనల్ మార్ట్ సూపర్ మార్ట్‌లో పనికి కుదిరింది. ఈ క్రమంలో యథావిధిగా ఈనెల 12న ఉదయం 6.30 గంటలకు నా గలక్ష్మి డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. నాగలక్ష్మి గురించి చుట్టుపక్కల, బంధువులు, తెలిసిన వాళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. నాగలక్ష్మి ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు మెరూన్ కలర్ టాప్, తెలుపు రంగు లెగ్గిన్ ధరించి ఉంది. 5.2 అడుగుల ఎత్తుతో తెలుపు రంగు ఛాయ కలిగి ఉంటుందని ఆమె తల్లి చామంతుల మంజుల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఘనంగా బేతాళ స్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, ఏప్రిల్ 14: అల్లాదుర్గంలోని బేతాళస్వామి జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు పోలేరమ్మ ఆలయం చుట్టూ రథంతో పాటు భక్తులు బోనాలతో ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.